# తొలిపి కట్టెలు

## కె. సదాశివరావు

ఈవేళ నాకో మంచి కాంట్రాక్టు దొరికింది" అన్నాడు చందులాల్ సంతోషంగా. అతడు లావుగా ఉన్నాడు. బట్టతల పైన సీమ్స్ వద్ద పగిలిపోయేలా వుంది అతడు వేసుకున్న సూటు. ఎదురుగా వున్న బార్ స్టూల్ మీద కూర్చున్న క్షితిజ్ భూషణ్ ఆ ఆనందంలో పాలు పంచుకుంటున్న వాడిలా తల వంకించి చిన్నగా నవ్వేడు.

ఎయిర్ కండిషనర్ నిశ్శబ్దంగా పని చేస్తూంది. బార్‌లో మరో పలుగురయిదుగురు మనుషులు అక్కడక్కడా కూర్చుని వున్నారు.

ఇంతలో కుడివేపుగా వున్న ఎలివేటర్ తలుపు తెరుచుకుని ఓ వ్యక్తి లోపలికి ప్రవేశించాడు. మంచి ఎండలో నుండి లోనికి వచ్చిన వాడిలా ఎర్రగా కందిపోయి వున్నాడు. వెలుగులో నుండి చీకటిలోనికి ప్రవేశించడం వల్ల కొద్ది క్షణాలు కళ్ళు ర్పుతూ కం ి ం చు కు ంటూ నిలబడి పోయాడు.

"హల్లో టురాక్.... టురాక్ హెల్ మన్!" చందూలాల్ గట్టిగా కేకేశాడు. "ప్లీజ్.... ఇలా రండి" పక్కనే వున్న బార్ స్టూల్ చూపిస్తూ అన్నాడు.

మెల్లగా అడుగులు వేస్తూ టురాక్ బార్ వైపుకి నడిచాడు.

"న్యూయార్క్ నుండి వస్తున్నప్పుడు నాతోపాటు వీరుకూడా ప్రయాణం చేశారు. ప్రొఫెసర్ క్షితిజ్ భూషణ్ ...స్ సైంటిస్ట్! వీరు ప్రొఫెసర్ టురాక్ హెల్‌మన్. "విశ్వరూప" నక్షత్ర నౌక ప్రస్తుతం ఓ యాత్రకు సిద్ధం చేస్తున్నారు."

ఇద్దరూ ఒక్కసారిగా నవ్వేరు. తర్వాత వీపులు చరుచుకుంటూ పరామర్శించుకున్నారు.

"మేమిద్దరమూ పాత స్నేహితులమే; యూనివర్శిటీలో కలిసి చదువుకున్నాము. కొంతకాలం కలిసి పనిచేశాం కూడాను" అన్నాడు టురాక్ నవ్వుతూ.

"ఐసీ"

చందూలాల్ కొద్దిపాటి విస్మయంతో అటూ ఇటూ చూసి బార్‌మన్‌ని పిలిచాడు.

"హాయ్ డానియెల్"

"యస్ సర్"

"ప్రొఫెసర్ గారికి కావలసిన డ్రింకేదో సిద్ధం చేయి."

ఓ...న్ చేసిన ఖీ ర్ కా న్ అలవాటు చొప్పున టురాక్ ముందుంచాడు.

"థాంక్యూ డాన్" అన్నాడు టురాక్ బార్‌మన్‌కేసి చూస్తూ.

"వెల్‌కమ్ సర్"

"నీ రాకకోసం ఓ వారం రోజులనుండీ ఎదురుచూస్తున్నాం క్షితిజ్. టేక్ ఆఫ్ టైం వరకూ నీవిక్కడే వుండితీరాలి ఓ.కే!"

"...రే టురాక్. నా ప్రాజెక్ట్‌కన్నా మొత్తానికి నీవేముందు సాధించావు సుమా"

"...ు అందరి సహకారం, ప్రోత్సాహం వల్లనే ఇది సాధ్యమైంది క్షితిజ్"

"మీరిద్దరూ స్నేహితులే కావచ్చు కాస్త మాక్కూడా అర్థమయేలా మాట్లాడితే మీకు పుణ్యముంటుంది. బాబ్బాబు, ఈ ప్రాజెక్ట్ గొడవేమిటో కాస్త చెప్పండి. నాకు తలా తోకా తెలియక చస్తున్నాను. ఈ ప్రాజెక్ట్‌కి నేను చేసిందల్లా కాంట్రాక్ట్ ప్రకారం ఓ అయిదు వందల టన్నుల స్పెషల్ ఉక్కు సప్లయి చేయడమే. ఇతర ఎలెక్ట్రానిక్ సామగ్రి కూడా కొద్దో గొప్పో జపనీస్ సహకారంతో సర్దుబాటు చేయగలిగాను. కాని ఈషిప్ ఎందుకు కడుతున్నారో దానినేం చేస్తారో నాకు బొత్తిగా అర్థం కా[illegible] లేదు. అదీగాక దానిని ఇక్కడెందుకు [illegible]డుతున్నారో కూడా నాకు బొత్తి అర్థం కావడం లేదు. కాస్త నాకు వివరంగా చెబితే సంతోషిస్తాను" అన్నాడు చందూలాల్,

సైంటిస్టు లిద్దరూ నవ్వేరు.

"లేకపోతే సహారా ఎడారిలో కట్టిస్తారా ఏమిటండీ" అన్నాడు టురాక్ చిలిపిగా.

"మీఇష్టం. బంగాళాఖాతం అట్టడుగున కట్టుకోండి నాకేమీ అభ్యంతరం లేదు. కాని ఒకటి చెప్పండి. ఈ వాహనాన్ని వేసుకొని ఆ దగ్గర్లోవున్న నక్షత్రానికి వెళ్ళడం నిజమేనా?" నమ్మలేనట్లుగా అడిగాడు చందూలాల్.

"అవును చందూలాల్‌జీ. ఈ ప్రాజెక్ట్ ఉద్దేశం ప్రాక్సిమా సెంటారీ నక్షత్రానికి సమీపంలోని ఇతర గ్రహాలకు వెళ్ళడమే" అన్నాడు టురాక్.

"ఏదో వ్యాపారం చేసుకుని సొమ్ము చేసుకుంటూ కడుపులో చల్ల కదలకుండా పడివుండేవాడిని. నేనన్నే మాటల్ని మీరేమీ పట్టించుకోకండి. అదేదో అవసరమైతే గనక మరేదన్నాగాని ఎందుకయ్యా ఈ ప్రయోగాలు? ఎవర్ని ఉద్ధరించడానికి? వీటివల్ల ఎవరికి లాభం?"

తమాషాగా చూశాడు టురాక్. బీర్ ఓ సిప్ తీసుకుని సమాధాన మిచ్చాడు.

"కొన్నింటికి కారణాలు అడగకూడదు చందూలాల్‌జీ. ఎందుకంటే చెప్పలేం గనుక. ప్రతి పనికీ లాభనష్టాలు బేరీజు వేయడం మంచిది కాదు. తాత్కాలిక లాభాలు లేకపోవచ్చు. దీర్ఘకాలికం చెప్పడం కష్టం. మనుషులు ఎవరెస్ట్ శిఖరాన్నెందు కెక్కేవారో కారణం ఏం





చెప్ప గలరా? ప్రాణాలు పోవచ్చని తెలిసి కూడా పెర్రీ నార్త్‌పోల్ ఎందుకు వెళ్ళాడు? కొలంబస్ ఎందుకు తన ప్రయాణాన్ని తలపెట్టాడు? మేము వెళ్ళబోతున్న నక్షత్రానికి ఇంతవరకూ ఏ మానవుడూ వెళ్ళలేదు. అందువల్లనే మేము వెళ్ళాలని నిశ్చయించుకున్నాము"

"అర్థమైందా చందూలాల్ జీ?" అడిగాడు క్షితిజ్.

"ఏమి చెప్పను? నేను వ్యాపారం చేస్తూంటాను. కొందరు గులాబీలు పెంచుతారు. ఇంకా కొందరు కుక్కల్ని పెంచుతుంటారు. ఇక మీరేమో నక్షత్ర నౌకల్లో ప్రయాణాలు చేస్తారు. ఇంతకన్నా లాజికల్‌గా నాకు అర్థం కావడం లేదు" అన్నాడు కొద్దిగా నిట్టూరుస్తూ,

కాసేపాగి డార్‌మన్ వంక చూసి అడిగాడు.

"వింటున్నావుగా డానియల్?"

"అవును సార్"

"అయితే చెప్పు. ఈ 'విశ్వరూప' షిప్‌లో ప్రయాణం చేయడానికి నీవు సిద్ధమా కాదా?"

"లేదు సార్"

"ఎందుకని?"

"నాకిక్కడ హాయిగా వుందండి. పైగా ఇలాంటి ప్రయాణాలు మా ఆవిడ అనుమతి లేకుండా తలపెడితే చంపేస్తుందండీ." అన్నాడు చిరునవ్వుతో

అందరూ గొల్లు మన్నారు.

క్షితిజ్‌భూషణ్ అన్నాడు.

"విన్నారుగా మీరు? కొందరు మాత్రమే ఇలాంటి సాహసోపేతమైన ప్రయాణాలకి సిద్ధపడతారు. ఇంకా చెప్పాలంటే కొలంబస్ లాంటి ఏ కొద్ది మందికో వో ఆ సాహస శక్తి అలవడి వుంటుంది. అలాంటి వారే సాధారణంగా ఈ ప్రయాణాలకి సన్నద్ధులౌతారు."

"కొలంబస్ సంగతి దానికి దీనికి పోలిక ఏమిటండి బాబూ? ఆయనగారు తిరిగి తిరిగి తన దేశం చేరుకుంటానని తెలిసే ఆ ప్రయాణం చేశాడు. కాని ఈ ప్రయాణంలో తిరిగి చేరడం అనేది ఉంటుందా అని. పోవడానికే అరవై ఏళ్ళు పడుతుందంటున్నారాయె. తిరిగి రావడం సంగతి దేముడెరుగు గాని బ్రతికి వుండగా అక్కడికి చేరడానికి వీలుందా అని నా అనుమానం"

"అందుకనేగా పిల్లల్ని తీసుకెళుతున్నాము" అన్నాడు టురాక్ తాపీగా.

చందూలాల్ షాక్ తిన్నాడు.



"ఏమిటి పసి పిల్లలా? మీకే మాత్రం ఇంగిత జ్ఞానం వున్నా ఇలాంటి తెలివి తక్కువ పని చేయరు. మీరు పెంచుతున్నారు కాబట్టి మీరు చేసే వెర్రి మొర్రి పనులకి మంచో చెడో బాధ్యత మీదే. అంతేకాని అశుభం శుభం తెలియని పిల్లల్ని ఇలాంటి ప్రయాణాల్లో తీసుకెళ్ళి వాళ్ళ ప్రాణం మీదకు తేవడానికి మీకేమీ హక్కు లేదు. యు హావ్ నో రైట్ ఎటాల్" అని ఉద్రేకంగా అరిచి కొద్దిగా ఆయాసపడ సాగాడు చందూలాల్.

"టేకిట్ ఈజీ చందూలాల్‌జీ." మీరంత ఉద్రేక పడవలసిన అవసరం లేదు. ఈ ప్రయాణంలో పాల్గొంటున్న వారంతా పెళ్ళయి పిల్లలున్నవారే. ఒక వేళ మాతరం వాళ్ళు చేయలేకపోతే మా పిల్లలు ఆ గమ్యాన్ని చేరుకుంటారు. మా మనుమలూ, ముని మనుమలూ ఇక్కడికి తిరిగి వస్తారు. ఇలా చూడండి"

తన జేబులోనుండి పర్సు తీసి అందులోని ఫొటోలు చూపించాడు.

"నా భార్య రియా, మా అమ్మాయి జీనా ఆరేళ్లు. మా అబ్బాయి రోహన్ రెండేళ్లు" చూపించి తిరిగి లోపల పెట్టేశాడు.

"అంత చక్కని భార్యా బిడ్డల్ని ఇంత ప్రమాదకరమైన ప్రయాణానికి ఎందుకు లాగుతున్నావ్ టురాక్? ఇక్కడే వాళ్ళని క్షేమంగా హాస్టల్స్‌లో పెడితే మంచిదని నా సలహా"

లేదండీ, మీ సహృదయతను నేను గుర్తుంచుకుంటాను. కాని ఈ ప్రయాణంలో ఇంకా పదిహేను మంది ఆడవాళ్ళూ దాదాపు ముప్పైమంది పిల్లలూ వున్నారు. వాళ్ళకి కంపెనీ వుంటుంది. షిప్ మీద వాళ్ళ కోసం ఓ చిన్న స్కూల్ వుంది. రిక్రియేషన్ రూమ్ వుంది. కావలసిన సదుపాయాలన్నీ వున్నాయి ఇంకా ఏం కావాలి" అన్నాడు టురాక్.

ఇంతలో ఎలెవేటర్ తలుపు తెరుచుకుని ఓ పిల్ల వచ్చింది. టురాక్‌ని చూడగానే బంతిలా ఎగురుతూ పరుగెత్తుకుంటూ బార్ వద్దకు వచ్చింది. ఆ పిల్ల అత్యంత మనోహరంగా వుండే రబ్బరు బొమ్మకి ప్రాణం వచ్చినట్లు వుంది. పెద్ద పెద్ద కళ్ళతో, బొద్దుగా ఆరోగ్యంగా వుంది. తను ఎక్కడ వుంటే అక్కడ సంతోషంతో వెలుగు తెచ్చేదానిలా వుంది.

"డాడీ లంచ్ రెడీ అమ్మ రమ్మంటోంది" అంది ముద్దు ముద్దుగా.

చందూలాల్ ముగ్ధుడై చూశాడు ఆ చిన్నారి వంక.

"హల్లో జీనా" అన్నాడు క్షితిజ్.

"హల్లో అంకుల్ నమస్తే" అంది జీనా

తండ్రి చేయిపుచ్చుకుని లాగింది రమ్మంటూ. బీర్ పూర్తిచేసి టురాక్ లేచి సెలవు తీసుకున్నాడు.

"కాన్ఫరెన్స్ పూర్తయాక ప్రాజెక్ట్ సైట్‌కి రా క్షితిజ్. నేను నీ కోసం ఎదురు చూస్తుంటాను. బై చందూలాల్‌జీ" భుజం మీద తట్టి వెళ్ళిపోయాడు, టురాక్ విద్యుల్లత లాంటిపాపని వెంటబెట్టుకొని పాప చేయి ఊపింది.

"ఇదంతా తెలివి తక్కువ పని అని నా అభిప్రాయం. మీరేమంటారు?" క్షితిజ్‌ని అడిగాడు సానుభూతి కోసం అర్థిస్తున్న వాడిలా

"ఇలాంటి విషయాల్లో ఎవరి అభిప్రాయాలు వారివి, అన్నింటినీ గౌరవించాల్సిందే" అన్నాడు క్షితిజ్.

"ఏమో నాకు తెలీదు. నేనో సామాన్యమైన వ్యాపారిని. ఈ యాత్రలు నాకు ఒంటబట్టవు. మీకు ఉక్కు కావాలనుకోండి నేను మీకు అమ్ముతాను. ఎంత కావాలన్నా ఇంతెందుకు ఎవడేనా ఉరేసుకుంటానంటే వాడికి మంచి త్రాడును కూడా అమ్ముతాను. అది వ్యాపార ధర్మం. కాని నాకు పిల్లలంటే ముద్దు. పాపం గారే ఆ పసి వాళ్ళు ఇంత ప్రమాదకరమైన యాత్రలోకి ఈడ్చుకెళ్ళటాన్ని నేను హర్షించలేను." అన్నాడు బాధగా.

అనునయంగా అన్నాడు చితిజ్.

"ఇందులో ప్రమాదమేముంది చందూలాల్ గారూ అందరి పిల్లలూ మామూలుగా ఇళ్ళల్లో అలవాటు పడితే ఈ పిల్లలు షిప్ డెక్కి అలవాటు పడతారు. అదీగాక తల్లిదండ్రులతో ఉండటం వల్ల వచ్చే సెక్యూరిటీ వాళ్ళకి మరెక్కడా లభించదు."

క్షితిజ్ వంక కాస్త అనుమానంగా చూశాడు చందూలాల్.

"ఇంతకీ వాళ్ళు ప్రయాణం పూర్తి చేసుకుని గమ్యాన్ని చేరతారని మీ ఉద్దేశ్యమా?"

"ఏం? బహుశా వాళ్ళు క్షేమంగానే చేరతారేమో ఎవరు చెప్పగలరు?"

"లాభం లేదు, వాళ్ళు చేరరు. ఈ విషయంలో నేను కొంత పరిశోధన చేశానండోయ్. ఏదో వ్యాపారస్తుడు అని కొట్టి పారెయ్యకండి. నా దగ్గర పనిచేసే టెక్నికల్ స్టాఫ్‌లో కొందరేమన్నారో తెలుసా?" అని క్షితిజ్ చెవి దగ్గరకు వచ్చి గుసగుసగా చెప్పాడు.

"ఈ షిప్ ప్రయాణానికి ముందే టేక్ ఆఫ్ స్టేజిలోనే కాలిపోవచ్చునట. ఆ గండం గడిస్తే ఇక పైనున్నాయి ఎన్నో ప్రమాదాలు. వాటిని దాటి ప్రయాణమే మొదలైతే ఈ షిప్ సూర్యుడి ఆకర్షణ శక్తికిలోనై అటు పోయి సూర్యుడిలో క్రాష్ అయి భస్మమైపోవడం ఖాయమట. అదీ తప్పించుకుంటే ఇంకా ఎన్ని ప్రమాదాలున్నాయో తలుచుకుంటే గుండె దడ పుడుతుంది. ఒకటి మాత్రం నేను బల్లగుద్ది చెప్పగలను వాళ్ళు బ్రతికుండగా ఆ నక్షత్రాన్ని చేరరు.''

అంత ఖండితంగా తన అభిప్రాయాన్ని చెబుతున్న చందూలాల్‌లో మరి ధైర్యం వెతికినా కనిపించ లేదు. అతని ముఖంలోని రక్తం దిగిపోయి పాలిపోయి కళావిహీనంగా తయారయాడు. నుదుటి మీద కొద్దిగా చెమట పట్టింది. అతని అవస్థ చూస్తే క్షితిజ్‌కి జాలి వేసింది.

చందూలాల్ కొద్ది క్షణాల్లో మళ్లీ మొదలెట్టాడు.

"వాళ్ళు ఈ ప్రయాణం నుండి ప్రాణాలతో బయట పడలేరు."

గుడ్ లార్డ్ ఈయన మళ్ళీ మొదలు పెట్టాడు తన సొద అనుకున్నాడు క్షితిజ్ ఇక ఆపితే బాగుండుననుకున్నాడు.

"ఎందుకంటే సిద్ధాంత పరంగా ఇది అసాధ్యం. ఏదో ఒక చిన్న మెషిన్ ఆగిపోవచ్చును. దాని వల్ల వాళ్ళు కాలిపోవచ్చును. లేదా చలితో గడ్డకట్టుకుపోవచ్చు. ఆ రెండూ కాకపోతే తిండి లేక మలమల మాడి చావడానికి కూడా అవకాశం వుందిట. అరవై ఏళ్ళ ప్రయాణం మరి?"

"ఏమో చెప్పలేం" అన్నాడు క్షితిజ్

"చెప్పలేక పోవడమేం? ప్రొఫెసర్ టురాక్‌కి అతడి బృందపు ఇతర సైంటిస్టులకీ పిచ్చి పట్టింది. దే ఆర్ క్రే

అందుకనే ఇలాంటి పనికి పూనుకున్నాను."

బార్ మన్ కేసి తిరిగి-

"చూడు డానియెల్. నీవు తెలివైనవాడివి ఇలాంటి ఇడియాటిక్ ప్రయాణాలలో ఏరు కున్నవి ప్రాణాల మీదకు తెచ్చుకునే కన్నా ఇక్కడే వుంటావని ఖచితంగా చెప్పేశావు. ఐ లైకిట్! నీలాగే నేనూ. కొలంబస్ టైపు! కొలంబస్! వాడంత వెర్రి వెధవ పృథ్విలో వుండక పోవచ్చు. హాయిగా ఇంట్లో కూర్చోక సాహస యాత్రలెందుకు చెప్పు" నిరసనగా ఏ భ్యా ఖావం తో అన్నాడు. మాటలు అతని నోటినుండి దాదాపు ఉమ్మేస్తున్నట్లుగా వెలువడ్డాయి.

డానియెల్ తలాడించాడు అర్థం — తను ఈ అభిప్రాయంతో ఏకీభవించనని సూచిస్తూ....

"నేనన్నది మీరు సరిగా అర్థం చేసుకో లేదు సార్. కొలంబస్ వంటి మహనీయులు, ధైర్యం, సంకల్పం వున్న శాస్త్రజ్ఞులు లేక పోతే ఇంత ప్రగతి వచ్చివుండేది కాదు. మనమిక్కడ ఇలా ఉండేవాళ్ళమే కాదు. నామట్టుకు నేను అంత సాహసమైన పని చేయలేను. కాని అది సాధ్యమని నేను నమ్మగలను. అందుకే నేను ఈ యాత్రను విమర్శించలేను. జయాపజయాలను గురించి చెప్పగల సాంకేతిక విజ్ఞానం నాకు లేదు. ఒకవేళ ఈ ప్రయాణం ఫలించి దేనేమో. లేక పోతే అంత శ్రమపడి ఆ సైంటిస్టులు ఎందుకు తమ కాలాన్ని డబ్బునీ వృధా చేస్తారు."

"భలే వాడివే. ఆ పెద్దవాళ్ళు పోతే పోనీవయ్యా కాని పిల్లల్ని తీసుకెళ్ళడం కూడా మంచిదేనంటావా?"

"ఈ కాలంలో పిల్లలు కూడా భయం లేకుండా పెరగాలండి."

"ఇహ చాలు నీ వాదన. వెర్రికుదిరింది తలకి రోకలి చుట్ట బెట్టమన్నాడట నీలాంటి వాడే." అన్నాడు చందూలాల్ డానియెల్ వంక కోపంగా చూస్తూ.

"ఆ భగవంతుడికి మనం నక్షత్రాలకి ఎగరాలనే వుద్దేశమే వుంటే మనకి ఏ రెక్కలో ప్రసాదించి వుండేవాడు లేదా ఓ రెండు జెట్ ఇంజన్లన్నా మనలో అమర్చి వుండేవాడు."

"ఇహ మీరు రెస్ట్ తీసుకోండి సార్. మీ ఫ్లైట్ సాయంత్రమే ననుకుంటాను" మెత్తగా సలహా ఇచ్చాడు డానియెల్.

"సరే థాంక్స్ డాన్. గుడ్ బై ప్రొఫెసర్!" అన్నాడు చందూలాల్ లేస్తూ.

"గుడ్ బై మిస్టర్ చందూలాల్"

"చేతనయితే మీ ఫ్రెండ్ కి చెప్పి ఈ ప్రయాణం ఆపించండి" అన్నాడు ఎలివేటర్ లో కాలు పెడుతూ. తలుపులు మూసుకున్నాయి.

"పాపం చందూలాల్." అన్నాడు క్షితిజ్ సానుభూతితో.

గ్లాసులు తుడుస్తున్న డానియెల్ అందుకున్నాడు.

"అది నిజం కాదు సార్, మానవజాతి ప్రగతిమీద నాకు నమ్మకముంది. ఓ సారి మా ముత్తాత డైరీలో చదివాను. విమానాలు శబ్దం చేస్తున్నాయి కాబట్టి వాటిని బాన్ చేయమని ప్రభుత్వానికి పిటిషన్ పెట్టారట, కాని ఆకాలం వాళ్ళకి తెలిసింది చాలా తక్కువ. ప్రగతిని ఏ వ్యక్తులూ ఏ ప్రభుత్వమూ ఒకనాటితో బంధించి ఆపలేరు. అది ముందు చూపగల ఏ కొద్దిమంది వల్లనో సాధ్యమవుతుంది. నేను ఆ జాతికి చెందను. నేను చాలా సామాన్యుణ్ణి, కాని నేను నా జీవిత కాలంలోనే ఎందర్నో చూశాను. వాళ్లు తమ జీవితాన్ని ఫణంగా పెట్టి ఏదో సాధిద్దామని ఊహించలేని సాహసాలు చేస్తారు. అలాంటివారి వల్లనే ప్రగతిసాధన సులభమవుతుందని నా దృఢ నమ్మకం"

"నీ వయసెంత డానియెల్"

"యాభై ఏండ్లు, ఈ బార్ లో గత పదేళ్ళుగా పని చేస్తున్నాను. వేరే వుద్యోగాలు యెన్నో సిటీలలో చేశాను."

"ఈ ఎయిర్ కండిషన్డ్ బార్ లో ఇలా ఏళ్ళబడి పనిచేస్తుంటే. మంచి గాలి దొరికే ప్రదేశంలో పనిచేయాలని నీకు అనిపించదా డానియెల్?"

"లేదు సార్. నేను న్యూయార్క్ బార్ లో పని చేస్తున్నప్పుడు ఇంతకన్నా మంచిగాలి నాకు లభించలేదు. ఇక్కడ నాకు బాగా నచ్చింది. ఈ వాతావరణం నా భార్యకు కూడా బాగా సరిపడింది. నా ఇద్దరు పిల్లలు ఇక్కడే ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఎప్పుడూ ఏదో కొత్తదనం ఉండేలా ఇక్కడ ప్రయోగాలు జరుగుతూనే వుంటాయి. మీలాంటి పెద్దపెద్ద వాళ్ళకు సర్వ్ చేసి మాట్లాడే అవకాశం వస్తూ వుంటుంది. ఇది నాకు నచ్చిన వూరు. ఇక్కడే నేను జీవితాంతం పడివుంటాను" అని చెప్పి

"ఇలా చూడండి సార్" అన్నాడు సంతోషంగా." అతడి కళ్లు మెరిశాయి.

అతడు ఒక చిన్న షాంపేన్ గ్లాసు— అతి సుకుమారంగా వున్న గ్లాస్ ని తీసి చేతి వేళ్ళతో గిర్రునతిప్పి పైకి ఎగరేశాడు ఆది మెల్లగా గిరిగింతలు కొడుతూ నీటిలో ఈదే చేపలా గ్రేస్ఫుల్ గాలేచి పైకప్పు దాకా వెళ్ళి అవలీలగా ఓక్షణం ఆగి మళ్ళీ మెల్ల మెల్లగా స్లోమోషన్ లో దిగడం ప్రారంభించింది. క్షితిజ్ దాని వంక చూస్తూ వుండిపోయాడు చిరునవ్వుతో. అది బార్ మీద దూది పింజలా మెత్తగా వాలబోయే క్షణంలో సున్నితంగా పట్టుకుని, తుడిచి గ్లాస్ రాక్ లో బోర్లించాడు డానియెల్.

"చూశారా సార్. గ్రావిటీతో ఆరో వంతు మాత్రమే. ఇక్కడ నా బరువు నలభై పౌనులే. మా ఆవిడ బరువు నలభై అయిదు పౌనులు. భూమి మీద వున్నప్పుడు నా బరువు రెండువందల నలభై పౌనులు. ఇక మా ఆవిడ కదల్లేకుండా కూచుని వుండేది. పైగా బ్లడ్ ప్రెషర్ హార్ట్ కంప్లైంట్.... ఆయాసం.... ఇప్పుడు ఇక్కడి లో గ్రావిటీకి అలవాటు పడిపోయాము. అందుకే ఈ లూనా సిటీలో వుండటానికి అలవాటు పడిపోయాం. ఈ చంద్రుణ్ణి వదిలి మేము ఎక్కడికీ వెళ్ళలేము, వెళ్ళంకూడా, కాని ఒక నమ్మకముంది" అని ఓ రెండు క్షణాలు ఆగాడు. ఏమిటన్నట్లు చూశాడు క్షితిజ్. రహస్యంలా చెప్పాడు డానియెల్.

"చందూలాల్ మునిమనుమలు, టురాక్ వారసులతో ఆ నక్షత్రమండలంలో వ్యాపారం చేస్తారు."

ఏమంటారుసార్? నిజమేనంటారా !"

"యు ఆర్ రైట్ డానియెల్. గాడ్ బ్లెస్ యు" అన్నాడు క్షితిజ్. ★